కథ

# ప్రియతమా...!

-శరత్ కుమార్

'రేపటినుంచి నాకూ అతనికీ ఎలాంటి సంబంధమూ ఉండదు' అనుకుంది స్వాతి. అలా ఆ రోజు అనుకోవడం ఏ వెయ్యోసారో!

పెద్ద పెద్ద కళ్లు. కొనదేలిన ముక్కు. ముక్కుచివర మెరుస్తున్న బంగారం ముక్కెర. మన్మథుడి చేతి విల్లులా వంపు తిరిగిన పెదాలు. గులాబీ రంగు పెదాలకు లిప్‌బామ్ పూసినట్టుంది. సూర్య కిరణాలు పడి తళతళలాడుతున్నాయి. శరీరం బంగారం రంగులో ఉంది. ఎక్కడికక్కడ వంపుసొంపులన్నీ తీర్చిదిద్దినట్టున్నాయి. గొప్ప శిల్పి చేతిలో ప్రాణం పోసుకున్నట్టు ఉంది స్వాతి. అందానికి తగినట్టుగా నీలిరంగు పైన ఎంబ్రాయిడరీ వర్క్ చేసిన చుడీదార్ వేసుకుంది. స్వాతి చెట్టు మొదలుకు ఆను కుని కూర్చుని ఉంది. ఆమె ముంగురులు గాలికి కదులుతున్నాయి.

చుట్టూ పచ్చదనం. పక్షుల కిచకిచలు వినిపిస్తు న్నాయి. దూరంగా దుముకుతున్న జలపాతం చప్పుడు, గాలివాటుకు అప్పడప్పుడూ వినిపి స్తోంది. చల్లటిగాలి వాతావరణాన్ని ఆహ్లాద పరు స్తోంది.

అది సిద్ధేశ్వరుడు కొలువున్న తలకోన అడవి. ఆలయానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఓ చెట్టు కింద కూర్చుని ఉంది స్వాతి. సాయంత్రం నాలుగు గంటలు కావస్తోంది. నీరెండ చెట్ల ఆకుల మధ్య లోంచి ఆమె మీద పడుతోంది.

ఆహ్లాదకరమైన వాతావరణంలో సైతం అంద మైన ఆమె ముఖం కళ తప్పి వెలవెల పోతోంది.


దుష్యంతుడి కోసం నిరీక్షించే శకుంత లలా ఉన్న ఆమెను మరో పొదరింటి చాటునుంచి రెండు కళ్లు తీక్షణంగా చూస్తున్నాయి.

నీరు లేక వాడిపోయిన గులాబీ పూవులా ఉంది స్వాతి ముఖం. ఆమెలో ఏనాటివో జ్ఞాపకాల శక లాలు కదులుతున్నాయి. అవి ఆమె ముఖంలో ప్రతిఫలిస్తున్నాయి.

సరిగ్గా ఐదేళ్లయింది. అవును. ఐదేళ్ల క్రితం ఇదే రోజు.. ఇదే చెట్టు కింద తను, అతను ఒకరికొకరు పరిచయం అయ్యారు. ఆ రోజు ఆదివారం. తను స్నేహితురాళ్లతో కలసి వచ్చింది. తమలాగే శిరి కూడా స్నేహితులతో తలకోనకు వచ్చాడు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ తలకోన అడవి అందాలను జుర్రుకున్నారు. పచ్చదనం వొడిలో పిట్టల్లా ఎగిరారు. జలపాతం వద్ద పిల్లల్లా కేరింతలు కొట్టారు. సాయం సంధ్యవెలుగు తొలగు తున్న వేళ, ఇదే చెట్టుకింద కూర్చున్నారు. తన కెదు రుగా ఉన్న శిరి 'ఐ లవ్‌యు' అన్నాడు. అన్నానని అనుకున్నాడు. కానీ అనలేదు. స్వాతి కూడా అదే స్థితిలో ఉంది.

మరో నెలకంతా స్వాతి, శిరిల పెళ్లయింది. ఇద్దరు ఆనందలోకంలో విహరించారు.

స్వాతికి ఇంకో ఏడాదికి గాని చదువు పూర్తి కాదు. తను తరగతి గదిలో కూర్చున్నా రాత్రి శిరి చేసిన అల్లరి చేష్టలు గుర్తొచ్చేవి. ఎప్పుడు క్లాసులు అయిపోతాయా, ఇంటికి పోదామా, స్నానం చేసి, నైటీ వేసుకుని, ముఖానికి పౌడర్ రాసి బొట్టు పెట్టు కుని, తలలో మల్లెలు తురుముకుని, శిరికోసం ఎదురు చూస్తూ గుమ్మం వద్ద నిల్చుందామా అని ఉంటుంది స్వాతికి.



శిరి ఓ చిన్న కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. జీతం బొటాబొటీగా సరిపోతుంది. కోరికల గుర్రాలు శారీరక వాంఛలను దాటి ఇంకా పరుగులు తీయకపోవడంతో వారి కుటుంబం సజావుగానే నడుస్తోంది.

అతను కూడా అంతే.. ఆఫీసులో పనిపైన మనసును లగ్నం చేయలేకపోతున్నాడు. ఎంత సేపూ రాత్రి తమకంతో తనను అల్లుకుపోయిన స్వాతి రూపమే గుర్తొస్తోంది. యువ హృదయాల సయ్యాటలు, ప్రేమ ఊసుల గుసగుసలు, మత్తెక్కించే మల్లెల సువాసనలు, కైపెక్కించే చెలి చూపులు, వదల బుద్ధి కాని ఆమె అధరాలు శిరిని ఉక్కిరిబిక్కిరి చేస్తుంటాయి. సాయంత్రం పనివేళలు కాగానే, రెక్కలు కట్టుకుని ఇంటివద్ద వాలిపోతున్నాడు. భార్యను కౌగిట బంధిస్తున్నాడు.

పగలు రాత్రి మాధుర్యం తాలూకు ఆలోచనల్లో, రాత్రి ఆ మాధుర్యం ఆస్వాదనలో.. రోజులు క్షణాల్లా గడిపేస్తున్నారు.



ఆనాటి తీపి జ్ఞాపకాలు గుర్తుకు రాగానే స్వాతి బుగ్గలు గులాబీరంగు పులుముకున్నాయి. కళ్లు అరమోడ్పులయ్యాయి. ఉచ్ఛ్వాస, నిశ్వాసలు బరువుగా మారాయి.

పొదరింటి చాటునుంచి రెండు కళ్లు స్వాతినే తీక్షణంగా చూస్తున్నాయి. ఆ కళ్లు కాంక్షతో రగిలిపోతున్నాయి. స్వాతి ఆ కళ్లను గమనించలేదు.

'ఇకనుంచి అతడి జ్ఞాపకాలను గుర్తు చేసుకోకూడదు' అనుకుంది స్వాతి. 'ఈ రోజుతో సరి! ఇక తనకూ అతడికీ ఎలాంటి సంబంధం ఉండదు' అనుకుంది. 'అతడు మనిషేనా.. తనను ప్రేమించిన వాడేనా.. అలా చేయొచ్చా?' అనుకుంది. అలా అనుకుంటూనే ఆ నాటి స్మృతుల్లోకి జారుకుంది.

స్వాతికి ఏడోనెల గర్భం. తల్లిదగ్గర ఉంటోంది. శిరి హైదరాబాదులో నాలుగు నెలలనుంచి ఉద్యోగం చేస్తున్నాడు. రెండువారాలకు ఒకసారి ఇంటికి వస్తున్నాడు. రెండు రోజులు ఉండి పోతున్నాడు. వచ్చినప్పుడు తన అర్ధాంగిని, తన సర్వస్వాన్ని ప్రేమసాగరంలో ముంచి, తనూ ఆనంద డోలికల్లో ఊగి తిరిగి వెళుతున్నాడు. అలా శిరి వచ్చి వెళ్లిన నాలుగో రోజు స్వాతికి వంట్లో బాగోలేదు. అమ్మ సాయంతో ఆసుపత్రిలో చేరింది. కడుపులో బిడ్డ చనిపోయింది. విషయం శిరికి చేరవేశారు. అయినా అతను రాలేదు. వారం రోజులు ఆసుపత్రిలోనే ఉంది స్వాతి. మరణం అంచులదాకా వెళ్లింది. అయినా శిరి రాలేదు. అలా రావడానికి వీలుకాని ఉద్యోగం తనది అన్నాడు శిరి. అతని మాటలు జీర్ణించుకోలేక పోయింది స్వాతి. దుఃఖించింది. ఆ దుఃఖానికి నిర్వచనం లేదు. అంతలా దుఃఖించింది.

కడుపున కాయాల్సిన కాయ కుళ్లిపోయింది. గుండెల్లో దాచుకోవాల్సిన ప్రేమ ఇగిరిపోయింది. ప్రేమలేని ఆ గుండెలపై తను పడుకోలేదు. ఆ రాతి గుండెతో తను ఊసులాడలేదు. ఆ రాతిగుండె తనకు అక్కరలేదు అనుకుంది స్వాతి. కఠిన నిర్ణయం తీసుకుంది. విడాకులకు దరఖాస్తు పెట్టుకుంది. మూడేళ్లయింది.

రేపు తమకు చట్టరీత్యా విడాకులు మంజూరు కానున్నాయి.

చదువు పూర్తికావడంతో తనకు ఉద్యోగం వచ్చింది. తోడుగా అమ్మ ఉంది. డబ్బుకు ఇబ్బంది లేదు. అయినా జీవితం నిస్సారంగా ఉంటోంది. జీవం ఉన్నా లేనట్టుగా ఉంటోంది. ఇప్పుడే ఇలా ఉంటే.., రేపటితో పూర్తిగా అతడితో బంధాన్ని తెంచుకున్నాక ఇంకెలా ఉంటుంది? ఆ ఊహే భరించలేకుండా ఉంది స్వాతి. అలా అని చావుబతుకుల్లో ఉండగా తనను అశ్రద్ధ చేసిన అతడిని తిరిగి జీవితంలోకి ఆహ్వానించడానికి మనసొప్పడం లేదు.

ఇన్నాళ్లు తమ మధ్య పెనవేసుకున్న బంధం మొలకెత్తింది ఆ చెట్టు కిందే. రేపటితో ఆ బంధం పుటుక్కున తెగిపోనుంది. తను కూడా ఊరొదిలి దూరంగా వెళ్లిపోనుంది. అందుకే, చివరి సారిగా తలకోనకు వచ్చింది. ఆ చెట్టుకింద కూర్చుంది. గత జ్ఞాపకాలను తవ్వుకుంటూ, ఆనందిస్తూ, దుఃఖిస్తూ ఉంది.

స్వాతి కళ్లు వర్షించే మేఘాల్లా ఉన్నాయి.

పొదరింటి చాటునుంచి ఆమెనే గమనిస్తున్న ఆ రెండు కళ్లు బయటకు వచ్చాయి. నిండైన ఓ యువకుడు ఆమె వైపు నెమ్మదిగా అడుగులు వేస్తూ వస్తున్నాడు. సంధ్య చీకటి ముసురుకుంటోంది. అతని అడుగులు పడి ఎండిన ఆకులు చప్పుడు చేస్తున్నాయి. ఆ చప్పుడుకు ఉలికి పాటుగా స్వాతి అటు వేపు చూసింది. అతడు ఆమెనే చూస్తున్నాడు. ఆమె కళ్లలోకే చూస్తున్నాడు. ఆమె గుండె లోతుల్లోకి చూస్తున్నాడు. అతడి చూపులు అంత తీక్షణంగా ఉన్నాయి. అతడు ఆమెకు దగ్గరయ్యాడు. ఆమె పక్కనే కూర్చున్నాడు.

'దూరంగా జరుగు' అనాలనుకుంది స్వాతి. కానీ అనలేదు.

అతడు ఆమె చేతిని తన చేతుల్లోకి తీసుకున్నాడు.

'వదులు' అనాలనుకుంది స్వాతి. కానీ అనలేక పోయింది.

ఆమె కళ్లు ఆశ్చర్యంగా, భయంగా, ఆనందంగా అతడినే చూస్తున్నాయి.

ఎన్నో యుగాలుగా ఎదురు చూసిన అపురూపమైన వస్తువు చేతికి చిక్కినట్టు ఆమెను గట్టిగా తన చేతుల్లో బంధించాడు.

'వద్దు.. వద్దు..' అని గట్టిగా అరవాలనుకుంది. కానీ మాట గొంతు దాటి బయటకు రాలేదు. అసంకల్పితంగా తనూ అతడిని తీగలా పెనవేసుకు పోయింది.

ఒకరికొకరు ఆలంబన దొరికినట్టు నేలపై వాలి పోయారు.

వారి మధ్య మాటల్లేవు. వారి కళ్లు మాట్లాడుకుంటున్నాయి.

వారి మధ్య మాటల్లేవు. వారి గుండెలు ఊసులాడుకుంటున్నాయి.

ఇద్దరి మధ్యా ప్రకృతి స్తంభించింది. వారిద్దరే ప్రకృతిగా మిగిలిపోయారు. ఇద్దరి మధ్యా పుట్టిన అగ్ని తుపాను, శీతల పవనంగా మారి, మంచు పుష్పాలుగా మిగిలారు.

ఇద్దరూ ఒకరి కౌగిలిలో ఒకరు ఒదిగి పోయారు. ఆమెలోని భావాలు అతడి కళ్లనుంచి నీటి రూపంలో బయటకు వస్తున్నాయి.

అలా ఎంత సేపున్నారో, ''నన్ను క్షమించు'' అన్నాడు శిరి. ఆ మాటలు కేవలం అతడి పెదాలే కాదు, కళ్లు, గుండె కూడా పలికాయి.

గలగలా నవ్వింది స్వాతి. కోల్పోయిన పెన్నిధి చేరువైతే కలిగే ఆనందానికి మాటలుండవు.

మబ్బులు విడిపోయిన చంద్రుడిలా ఉన్న స్వాతిని తిరిగి తమకంగా అల్లుకు పోయాడు శిరి.

*